# కన్నీల వెన్నెల

శ్రీధర



బాగా ఆకలిగా ఉంది. వాళ్ళిద్దరూ నిన్నటినుంచీ ఏమీ తినలేదు. కడుపులో దావానలం లాంటి ఆకలి దహించివేస్తుంటే, కుండలోని నీళ్లతో దాన్ని చల్లార్చాలని సావిత్రి వృధా ప్రయాస పడుతోంది.

గుడిసె ముందున్న అరుగుమీద అంజిగాడు మూడు అంకేసి ముడుచుకుని పడుకున్నాడు. సావిత్రి తడికె గుమ్మానికి అడ్డంగా కూర్చుంది.

పొద్దుగూకి చాలాసేపు అయింది. ఊరంతా అప్పుడే సద్దుమణుగుతోంది. కల్లాకపటం ఎరుగని పేదవాళ్ళ గుమ్మాల ముందు తెల్లాతెల్లని వెన్నెల చల్లచల్లగా వ్యాపిస్తోంది. నెమ్మది నెమ్మదిగా వీస్తున్న గాలి ఆరుబయట నులక మంచాలమీద వాలిన వారందరినీ ఆప్యాయంగా వొళ్లు నిమిరి సేద తీరుస్తోంది. కలోగంజో తాగినవాళ్లంతా అప్పుడే మత్తుగా కళ్లుమూసుకుని వొత్తిగిలి పడుకుంటున్నారు.

సావిత్రి మాత్రం కళ్లింత చేసుకుని నింగిలోని నక్షత్రాలవంక చూస్తోంది. మరొక సమయంలో అయితే కొంతగాక పోతే కొంతయినా ఈ వాతావరణం ఆహ్లాదంగా ఉండేదే. కానీ ఇప్పుడామె కడుపులో ఎలుకలు పరుగిడుతున్నాయి. గుడిసెనిండా ఎలుకలే. ఒకటి కాళ్లమీద నుంచి జర్రున బయటికి పారిపోయింది. సావిత్రికి కూడా అంతా స్వేచ్ఛగా, శీఘ్రంగా పారిపోవాలనే ఉంది. కానీ ఎక్కడికి పోవాలో తెలీదు. ఒకవేళ తెల్సినా ఇప్పుడు ఓపిక లేదు. నిన్నటి నుంచీ అన్నం తినలేదు. కళ్లు తిరుగుతున్నాయి. వొళ్లు తూలుతోంది.

భర్త అంటే భరించేవాడని చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో చెప్పిన మాటలు సావిత్రి కింకా గుర్తున్నాయి.

అంజిగాడు నలుగురిలో తన మెడలొంచి తాళికట్టాడు కాబట్టి మొగుడైపోయినాడు. అప్పట్నించీ దించుకోలేని బరువై భుజాలమీదకెక్కి కూర్చున్నాడు. సవతి తల్లి పోరు భరించలేక తండ్రి ఈ శుంఠాగ్రేసర చక్రవర్తిని తెచ్చి తన మెడకు కట్టి, అలా కట్టిన మూడోనాడే వేరు కాపురం పేరుతో ఊరుబయట ఈ పూరి గుడిసెలో తనని దించేసి ఇంటికెళ్లి ఎంచక్కా చేతులు కడిగేసుకున్నాడు. పెళ్లి అయ్యాక ఇంక కష్టమైనా, సుఖమైనా, కిందపడ్డా, మీదపడ్డా, మీ అవస్థ మీరు పడాలని. తండ్రి పోతూపోతూ ఒక ఉచిత సలహా ఉచితంగానే ఇచ్చివెళ్లాడు. సరేగదా అనుకుంటే, ఈ అంజిగాడు శుద్ధబుద్ధావతారం అని ఇక్కడి కొచ్చిన మరుక్షణమే క్షుణ్ణంగా అర్థమైపోయింది. అప్పట్నించీ మానసికంగా, శారీరకంగా సావిత్రి కష్టపడిందే గాని సుఖపడలేదు. తండ్రి చెప్పాడుగదాని, కిందామీదాపడదామంటే, వీడు దగ్గరకే రాడు. అంజిగాడికి నోట్లో నాలిక లేదు. తాటిపట్ట లాంటి నాలిక ఉన్నా అది ముద్దమీద ముద్ద మింగటానికి తప్ప మరెందుకూ పనికి రాదు. జీవితం ఎలా గడుస్తుందంటే ఉలకడు, పలకడు. ఎక్కడైనా, ఏదైనా పని చేసి పావలా డబ్బులు పట్రమ్మంటే,

అదేదో గ్రీకు, లాటిన్ భాష అయినట్లు, ఒక్క అక్షరం అర్థం కానట్లు అయోమయంగా మొహం పెడతాడు. చాదస్తపు మొగుడికి చెబితే తెలియదు, గిల్లితే ఏడుస్తాడు. ఇది అంజిగాడి పట్ల అక్షరాలా నిజమై కూర్చుంది.

అంజిగాడ్ని ప్రయోజకుడిని చేసి, తన సంసారాన్ని చక్కదిద్దుకోవాలని అంతో ఇంతో చదువుకున్న సావిత్రి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. విసుగెత్తి మానేసింది. ఇప్పుడు వీణ్ణి ఎలా వొదిలించుకోవాలా అని మాత్రమే చూస్తోంది. సావిత్రికి అదేమంత పెద్ద విషయం కాదు గానీ, ఆ తర్వాత ఊరు ఊరంతా దుయ్యబడితే భరించగలనా- అన్న అధైర్యం ఆమెను క్రుంగదీస్తోంది. మబ్బువిడిచిన ఎండ, మొగుడు విడిచిన ముండ అని కనిపించిన ప్రతివాడూ అంటుంటే తట్టుకుని నిలబడటం సాధ్యమా అని ఇందాకటినుంచీ ఆలోచిస్తోంది.

అరుగుమీద పడుకున్న అంజిగాడికి పాపం ఆలోచన లేమీ రావు. అంతవరకు గొప్ప అదృష్టమే. అయితే పెళ్లాం నిన్నటినుంచీ వంటచెయ్యలేదు. అన్నం పెట్టటం లేదు. అన్నం తింటే మంచి నిద్రొస్తుంది. సావిత్రి ఎక్కడినుంచన్నా అన్నం తెచ్చి పెడితే బావుణ్ణు అని మాత్రం అనుకున్నాడు.

సావిత్రి ఏదీ నిర్ణయించుకోలేక పోతోంది. స్వరూపరాణి వాళ్ల తోటపక్కనే ఉంది. మొన్న విహారానికొచ్చిన స్వరూపరాణి తనవంక చూసి, వెంట తీసుకెళ్లింది. కొబ్బరినీళ్లు త్రాగారు ఇద్దరూ.

'ఒకప్పుడు మనిద్దరం కల్సి చదువుకున్నాం. అప్పట్లో నీ కన్నీ ఫస్టు మార్కులే వచ్చేయి. నిన్ను చూస్తే ఎంతో జెలసీగా ఉండేది. ఇప్పుడు నిన్నీ స్థితిలో చూస్తుంటే అంతులేని జాలివేస్తోంది సావిత్రీ' అంది రాణి.

విరక్తిగా నవ్వింది సావిత్రి. చాలా సేపు చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. వస్తుంటే రెండు కొబ్బరి బోండాలు ఇచ్చింది రాణి. నీ కెప్పుడు కావాలన్నా ఈ తోటలోకి వచ్చి నీ క్కావల్సినవి పట్టుకెళ్లు. మొహమాటపడకు' అని కూడా చెప్పింది.

ఇప్పుడా మాటలు గుర్తొచ్చాయి సావిత్రికి. గుడిసెలో చుట్టూ మరోసారి కలియచూసింది. ఎక్కడా ఏమీ లేదు అమ్మటానికి. పొయ్యిలో పిల్లి లేవలేదు. అన్నట్లు ఇక్కడేమీ లేవని తెల్సి పిల్లి కూడా ఇటుకేసి రావటం మానేసింది. ఇకపోతే కుండలో నీళ్లు కూడా నిండుకున్నాయి. ఇదివరలో కళ్లల్లో కన్నీళ్లన్నా నిండేవి. ఊరికూరికే ఉబికుబికి బయటికొచ్చేవి. ఇప్పుడు ఏడుపు రావటంలేదు. దుఃఖాశ్రువులూ రావటంలేదు.

ఉండుండి ఆకలి జ్వాలలు రెల్లుగడ్డి మంటల్లా భగ్గుమని మండుతున్నాయి. ఇంక ఆగలేకపోయింది. ఏదో ఆలోచన రాగానే లేచి నిలబడింది.

ఊరంతా నిద్రాణంగా ఉంది. దారి నిర్మానుష్యంగా ఉంది. జనమంతా గాఢ నిద్రలో వున్నందువల్ల, అంతటా స్మశానంలోని భీకర నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. పొగజూరిన గుడిసెలన్నీ చదలుపట్టిన పుట్టల్లా ఉన్నాయి. అలవాటైన బాటన నాగుబాములా చరచరా నడిచి వెళ్లింది సావిత్రి. తోట శిథిలమైన కోటలా ఉంది. వెన్నెల్లో చెట్ల నీడలు చరిత్ర మిగిల్చిన జ్ఞాపకాల మరకల్లా ఉన్నాయి.

అక్కడున్న కొబ్బరికాయల కుప్ప ముందు నిలబడింది. ఒక క్షణం ఆగింది. దొంగతనం చేస్తున్నానా అన్న సందేహం లీలగా మెదిలింది. అయినా మరుక్షణంలోనే ఆకలిమంట గుర్తొచ్చింది. రెండు చేతుల్లోకి రెండు కొబ్బరిబోండాలు తీసుకుంది. వెనుదిరిగి నాలుగు అడుగులు వేసిందో లేదో 'ఆగు' అన్న కేక వినిపించింది. కాళ్లకు సంకెళ్లు వేసినట్లు ఆగిపోయింది సావిత్రి.

భూపాలరావు ఆమె దగ్గరకు వచ్చాడు. ఈయన స్వరూపరాణికి సాక్షాత్తూ అన్న. అయినా ఇద్దరి మధ్యా రేయికీ,పగలుకీ ఉన్నంత వ్యత్యాసం ఉంది. సాధారణంగా ఈ వేళప్పుడు ఇక్కడ ఉండవల్సిన మనిషి కాడాయన. అలాంటి వ్యక్తి కంటపడిందంటే అది నిజంగా సావిత్రి దురదృష్టమే. బోండాలు అక్కడ పడేసింది.

"చివరకు దొంగతనాలకు దిగావన్న మాట?" ఆయన మాటలు పిడుగుల్లా వచ్చి చెవినపడ్డాయి.

"మొన్న స్వరూపరాణి తీసుకెళ్లమందండీ!" అంది సావిత్రి సంజాయిషీ చెప్పుకునే ధోరణిలో.

"మొన్న తీసుకెళ్లమంటే, ఇంక రోజూ అదే పనా? అయినా అది చిన్న పిల్ల. దాని మాట లెక్కేమిటి? పెద్ద వాళ్లం మమ్మల్ని అడగక్కర్లేదా?" అని దబాయించాడు.

సావిత్రి ప్రతిఘటించ దల్చుకోలేదు. ఇంతకీ తన రోజులు బాగోలేవు. తాడు అని ముట్టుకుంటే, అది పామై కరుస్తున్నప్పుడు ఎవరికేం చెప్పుకుని ఏం ప్రయోజనం?

"ఇలా రా" అని గద్దించాడు భూపాలరావు. సావిత్రి మంత్రముగ్ధలా ఆయనవెంట పాకలోకి నడిచింది.

ఆయన మంచంమీద కూర్చుని సావధానంగా సిగరెట్టు వెలిగించుకుని గుప్పున పొగవదిలి సాలోచనగా సావిత్రివంక చూశాడు. ఆమె ఆయన ముందు దోషిలా తలొంచుకుని నిలబడింది. ఒంటినిండా చీర కప్పుకోవాలన్న ధ్యాస ఆమెకిప్పుడు లేదు. చిరిగిన రవికెలోనుంచి పరువాల పొంగులు తొంగి చూస్తున్నాయి.

సరిగ్గా ఆడదాని రవిక అనని చోటే రసజ్ఞుని దృష్టి నిలుస్తుంది. ఆ మాట కొస్తే భూపాలరావుగారి రసపిపాస అంతా ఇంతా కాదు. చివరికి నింపాదిగా అయనే అన్నాడు.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో నువ్వే చెప్పు. చూశాను కాబట్టి సరిపోయింది. ఇంతకుముందు ఇలా ఎన్నిసార్లు ఎత్తుకుపొయ్యావో నాకేం తెలుసు?"

"నేను అలాంటిదాన్ని కాదండీ," అంది ప్రాదేయపూర్వకంగా.

"ఏ మనిషీ ఇలాంటివాడని ఖచ్చితంగా ముద్రవేయటానికి మనమేం మరబొమ్మలం కాదు గదా? ఎవరి అవసరాలు వాళ్ళవి." అంటూ అదోలా చూశాడు. సావిత్రి మాట్లాడలేదు. మళ్లీ అయనే అందుకున్నాడు.

"రేపు నలుగురిలో పంచాయతీ పెట్టి ఈ విషయం విచారణ చేయించాననుకో. నీకూ చిన్నతనం. నిన్ను కన్నతండ్రికీ, కట్టుకున్న మొగుడికీ కూడా అవమానం. ఏమంటావ్?"

"ఈ సారికి క్షమించి వదిలెయ్యండి" అంది సావిత్రి.

"వదిలెయ్యక ఇప్పుడు నిన్ను నేను తెల్లార్లూ పట్టుక్కూచుంటా ననుకుంటున్నావా? దొంగతనం చేస్తూ పట్టుబడిపొయ్యావ్. అదే మగాడయితే చీల్చి చెండాడేవాణ్ణి. నువ్వు ఆడదానివి. ఏం చెయ్యటానికీ చేతులు రావటల్లేదు."

అయన నెన్ని అన్నా, సావిత్రి మారు మాట్లాడటం లేదు. అయన శిక్షించక తప్పదు అన్నప్పుడల్లా క్షమించమని మాత్రం అంది. సిగరెట్టు అర్పేశాక, ఆయన కూజాలోంచి నీళ్లు ఇమ్మన్నాడు. గ్లాసులో పోసి నీళ్లు అందించింది. భూపాలరావుగారు గ్లాసుకు బదులు సావిత్రి చేతిని అందుకున్నాడు. ఆమె మాట్లాడకపోవటంతో దగ్గరకు తీసుకున్నాడు, 'నాకూ కావాలి కొబ్బరి బోండాలు' అంటూ.

ఇప్పుడూ సావిత్రి ప్రతిఘటించలేదు. ఏమిటిది అని ఎదురు తిరగలేదు. యాంత్రికంగా ఆయనకు చేరువైంది. భూపాలరావుగారు పొదివి పట్టుకుంటే, అందుకేమీ అభ్యంతరం చెప్పకపోగా, 'ఆకలిగా ఉందండీ' అని అభ్యర్థించింది, కన్నీళ్ళతో. ఆయన కౌగిట్లోనుంచి జారి కాళ్ళమీదకు వొరిగిపోయింది.

భూపాలరావు ఆమెను లేవదీసి మంచంమీద కూర్చోబెట్టాడు. ఈ సారి ఫ్లాస్క్‌లోనుంచి తనే కాఫీ తెచ్చాడు. సావిత్రిని అక్కున జేర్చుకుని, ఆప్యాయంగా పొదివి పట్టుకుని ఒక్కొక్క గుక్కే త్రాగించాడు. ఆదరణ పుట్టి బుద్ధి ఎరిగాక, తండ్రినుంచి గాని, భర్త నుంచి గాని, నా అన్నవాళ్ళనుంచి గాని ఎన్నడూ ఎరగని సావిత్రి భూపాలరావు గారి గుండెలమీద వాలిపోయి, ఎనలేని పెన్నిధి దొరికినంత బలంగా కౌగిట్లో బంధించేసి, ఆయన గుండెలమీద తల వాల్చి చిన్నపిల్లలాగా వెక్కి వెక్కి ఏడ్చింది. ఎన్నేళ్ళగానో గుండెల్లో ఘనీభవించిన కన్నీరు, మొట్టమొదటి సారిగా దొరికిన పురుషుని ఆలింగనంలోని నునువెచ్చదనానికి కరిగి, ఉప్పొంగి ప్రవహించింది.. స్త్రీ జన్మకు సార్థకతను కూడా అప్పుడే పొందింది.

ఆ రాత్రి ఆ విధంగా సావిత్రి ఒక కప్పు కాఫీకోసం తన కన్నెరికాన్ని సంతోషంగా సమర్పించుకుంది.

"రేపుకూడా ఇదే సమయానికి రా." అంటూ భూపాలరావుగారు యాభై రూపాయల కాగితం ఆమె రవికెలో దోపాడు.

సావిత్రి మౌనంగా తనను తాను సమాధానపరచుకుంది. 'ఇది తప్పో, ఒప్పో నాకు తెలియదు.... భగవంతుడు మనిషిని సృష్టించిన మరుక్షణమే ఆకలినీ సృష్టించాడు. అనాది మానవుడినుంచి ఈనాటి మానవుడివరకు ఆకలి తీర్చుకోవటం అనివార్యం. ఈ ధరిత్రి చరిత్రతో ముడివడిపోయిన ఆకలిముందు, నిన్నమొన్నటి సభ్య నాగరిక సమాజం సృష్టించిన అతి సున్నితమైన నీతినియమాలు ఎక్కడ నిలుస్తాయి?' అని అనుకుంది.

సావిత్రిని సాగనంపడానికి బయటకి వొచ్చిన భూపాలరావు, ఆమె ఒడి నిండినన్ని కొబ్బరిబోండాలు ఇచ్చాడు. రేపు రావటం మర్చిపోవద్దని గుర్తుచేసి పంపాడు.

మర్నాడంతా సావిత్రి అన్యమనస్కంగానే ఉంది. ఏం జరిగింది? ఏం జరగబోతోంది? పెద్ద కోరికలేమీలేవు. కడుపు నిండా తిండి, ఒంటినిండా బట్టా కావాలని కోరుకోవటం పెద్ద నేరమని, అవి గగనకుసుమాలే అయితే ఎలా?

యాభై రూపాయలు మార్చింది. ఇంట్లోకి కావల్సినవన్నీ కొద్దికొద్దిగా తెచ్చుకుంది. ఇష్టమైనవన్నీ చేసుకుంది. జీవితంలో ఎన్నడూ ఎరగనంత తృప్తిగా భోంచేసింది. అంజిగాడు కూడా హాయిగా ఆరగించేసి, గుర్రుపెట్టి నిద్రపోయాడు. ఇవన్నీ ఎక్కడనుంచి వచ్చాయని మాట మాత్రంగానైనా అడిగితే ఒట్టు. అహా, నాకుగాక వేరెవరికైనా కంచుకాగడాలు వేసుకుని వెతికినా దొరుకునా ఇటువంటి మొగుడు— అని నిట్టూర్చింది. ఎవర్ని నిందించాలి? అలా అనేసి తొంగుంటే, చీకూచింతా లేకుండా గడవటానికి వీడేమన్నా తాతాగారి మనవడా, బిర్లాగారి బొమ్మర్దా? దారిద్ర్యపు పోగు మెడనేసుకు పుట్టిన మనిషని మర్చిపోయి నిశ్చింతగా నిద్ర ఎలా పోగలుగుతున్నాడో? అతను గుర్రక ఎలా పెడుతున్నాడో? ఏమీ తెలియని అమాయకుడని అనుకోవటానికీ సావిత్రికి మనసొప్పటంలేదు. అమాయకుడైతే చెప్పిన పని చేయాలి గదా పని చెయ్యకుండా తప్పించుకు తిరగటంలో ఎంత పట్టుదల చూపిస్తు

న్నాడు? చాపను వీపున కట్టుకు తిరగటం కష్టమని, పొద్దున్నే పక్కమీదనుంచి లేస్తాడు గాని, లేకపోతే అదీ బద్ధకమే. కనీసం మొగుడిచేత కాఫీ అయినా కలిపిద్దామనే ఒకరోజు విశ్వప్రయత్నం చేసింది. డికాషన్, పాలు విడివిడిగా తాగాడే గాని, కలుపుకుని తాగలేదు. అది చూశాక, ఇంక వీణ్ణి లొంగదీయటం దేవుడితరం కూడా కాదని నిర్ణయించుకుంది. సాక్షాత్తూ దేవుడే కలలో ప్రత్యక్షమై, ఏంకావాలో కోరుకోమని అడిగితే, నిద్దర చెడగొట్టాదని చెబుతాడు.

మొదటిరోజు సావిత్రి ఆకలికి ఆగలేక తోటలోకి వెళ్ళింది. రెండోరోజు వ్యామోహం తట్టుకోలేక వెళ్ళింది. ఆ రెండురోజులూ ఎవరూ అడ్డుపడలేదు కాబట్టి మూడోరోజు వెళ్ళింది. సావిత్రి అడగకుండానే భూపాలరావు డబ్బు ఇచ్చాడు. అడగలేదుకదా అన్న సందేహం వెలిబుచ్చితే, ఆయన అలవోకగా నవ్వాడు.

“నేను మనుష్యుల్ని పుస్తకాల్లా చదివేస్తాను” అన్నాడాయన.

“అయితే మీకు పుస్తకాలను పక్కలో పెట్టుకుని చదవటం అలవాటు అనుకుంటాను.” అంది సావిత్రి కూడా నవ్వుతూ. డబ్బు తీసుకోమని అతను బలవంతం చేశాడు.

సావిత్రికి మూడు భాషలు వచ్చు. కళ్ళతోనే మౌనంగానే నాలుగో భాషను కూడా మాట్లాడగలదు— అయినా ఒక్క భాషలోనూ, ‘మీ డబ్బు వద్దు’ అని చెప్పలేకపోయింది. ఎప్పుడైతే డబ్బు తీసుకుందో, అప్పుడే అమ్ముడుపోయింది. ఆ క్షణంలోనే ఆయనకు ఆమె మీద హక్కుకూడా వచ్చేసింది.

తర్వాత వొంట్లో బాగాలేక సావిత్రి నాలుగురోజులు ఇల్లు కదల్లేదు. అదే ఆమె కొంపముంచింది. అయిదోరోజు సాయంత్రం అంజిగాడి శవం కాలువలో తేలింది. జరగకూడనిది జరిగిపొయ్యాక, ఇంక జరగవల్సినవన్నీ జరిగిపొయ్యాయి. సావిత్రి అక్షరాలా అనాథ అయింది. విధవ అయింది. దరిద్రపుగొట్టుదయింది. ఇంత ఆపద వచ్చినా సవతితల్లి, స్వంత తండ్రీ పట్టనట్టే ఊరుకున్నారు. ఊరి పెద్ద ఉదారస్వభావుడు, పతిత దీనజదోద్ధారకుడు భూపాలరావుగారే సావిత్రిని దగ్గరకు తీసాడు. ఎక్కడో ఎందుకు మా తోటలోనే ఉండమన్నాడు. అలా సావిత్రి ఆయన తోటలోకి మారింది.

కొన్నాళ్ల కాలం కార్చిన కన్నీటి జాలులో కొట్టుకుపోయినయి.

ఒకరోజు పనివాళ్లు వచ్చి తోటంతా శుభ్రం చేశారు. ఏమిటీ హడావుడి అంతా అని అడిగితే, తోటలో ఏదో సినిమా షూటింగ్ అవుతుందిట. సినిమా వాళ్లు అనేటప్పటికి అందరికీ ఎక్కడలేని ఉత్సాహం పెల్లుబికింది. ఊరు ఊరంతా ఉడికిపోయింది. మూడురోజులు ఊళ్ళో చుట్టుపక్కల అనేకచోట్ల సినిమా షూటింగ్ జరిగింది. పిల్లాపెద్దా, ముసలీ ముతకా అంతా అక్కడే ఉన్నారు. సినిమాజనం భూపాలరావుగారింట్లోనే దిగారు. ఆయనే వాళ్లకు కావల్సిన ఏర్పాట్లన్నీ చేస్తున్నారు. కొంత భాగం తోటలో కూడా షూట్ చేశారు. ఆ సమయంలో అక్కడికి సినిమాతారలే సావిత్రి దగ్గరకు వచ్చారు. వాళ్లకు కావల్సిన భోజనాలు, టిఫెన్లు సావిత్రే వడ్డించింది.

సావిత్రిని చూసిన డైరక్టరు ఎందుకో చప్పున ఆమెమీద నుండి చూపు మళ్లించుకోలేక పొయ్యాడు.

“మీకు అభ్యంతరం లేకపోతే, ఒక



చిన్న వేషం వేస్తారా?" అని అడిగాడు అంత పెద్ద డైరక్టరూ సావిత్రిని చూడ గానే_

అదొక గొప్ప పొగడ్తగా, తన అందానికో పెద్ద గుర్తింపుగా భావించి సావిత్రి లోలోపల చాలా సంతోషించింది. అయినా తనకేం చేతకాదని సిగ్గు పడింది. తనకేం కావాలో దాన్ని ఎలా రాబట్టుకోవాలో ఆ డైరెక్టరుకు తెల్సినట్టుగా మరెవరికీ తెలీదు. అందుకని ఆమెను బుజ్జగించాడు. ధైర్యం చెప్పాడు. భూపాలరావుగారికి తెలియకుండానే సావిత్రి ముహానికి రంగు పూయించాడు. నాలుగు డైలాగులు చెప్పించాడు. అంతా అయ్యాక చాలా బాగాచేశావని ఆమె భుజం తట్టి చెప్పాడు.

వెళ్లబోయేముందు ఒంటరిగాపక్కకు పిల్చి ఇంకా అనేక ఆశలు కల్పించాడు. "నీ ఫేస్‌లో మంచి యాంగిల్స్ ఉన్నయి. గొప్ప భావప్రకటన ఉంది. కొంచెం తర్ఫీదు పొందితే చాలు, ఫీల్డును దున్నేస్తావు. నువ్వు ఊ అంటే చాలు, నా తర్వాత పిక్చర్లో నిన్ను హీరోయిన్ని చేస్తాను" అని ప్రలోభాలు చూపించాడు.

"కానీ అయనకు చెప్పకుండా చిన్న వేషం వేసినందుకే భూపాలరావు నన్ను రాత్రి ఛెడమడా తిట్టారు" అని చెప్పుకుంది సావిత్రి.

"చలనచిత్ర గగనతలానికి ఎగరాలంటే ముందీ బంధాలన్నీ తెంచుకో. నీది విలక్షణమైన సౌందర్యం. దాన్ని పూరిగుడిసెల్లోనూ, కొబ్బరిమట్టల్లోనూ వాడిపోనివ్వకూడదు. ఆరు కోట్ల తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తిగా నిన్ను తీర్చి దిద్దుతాను నా దగ్గరకు వచ్చెయ్" అని మరీ మరీ చెప్పాడు. ఉత్తరం రాయమని అడ్రసు ఇచ్చాడు. ఆమె చిరునామా రాసుకున్నాడు.

సావిత్రికి ఏవేవో రంగు రంగుల కలలు, అలలు అలలుగా వచ్చి వలలు వలలుగా మారినయి. ఇంక అక్కడ్నించీ అరికాల్లో ఒకటే దురద. అయితే భూపాలరావు ఆమె ఆశలమీద చన్నీళ్లు చల్లాడు.

"పిచ్చి మొహమా, ప్రతివాళ్లకీ అరచేతిలో స్వర్గం చూపించి, పబ్బం గడుపుకోవటం ఇవాళ్టి పద్ధతి. అవన్నీ నమ్ముకుంటే మట్టికొట్టుకు పోతావు. ఇంకో విషయం చెప్పనా? నీ ముహానికి రంగు పూసి, నీ నటనా కౌశల్యాన్నంతా కెమెరాలో బంధించాడని నువ్వు అనుకుంటున్నావు కదూ. అదంతా వట్టి మాయ. అసలా డబ్బాలో ఫిల్మ్ ఉందో, లేదో అనుమానమే. అదో మాయాలోకం. మనకెందుకు చెప్పూ...." అని భూపాలరావుగారు సావిత్రి మనసును మళ్లీ తన వైపుకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నం చేశాడు.

ఇదిలా ఉండగానే ఒకరోజు అటుగా వెళ్తున్న సత్యం సావిత్రిని చూసి నవ్వాడు. పలకరించాడు. చాలా ఏళ్ల తర్వాత కనిపించిన సత్యాన్ని మొదట సావిత్రి గుర్తే పట్టలేకపోయింది. సత్యం కూడా చిన్నప్పుడు తనతో కల్సి చదువుకున్నవాడే. ఆస్తిపాస్తులు అసలు ఏమీ లేవు. ఊరికి ఎడంగా వున్న గూడెంలో ఉంటారు వాళ్లు. అప్పట్లో బళ్లో కూడా సత్యాన్ని ఎవరూ తాకనిచ్చేవాళ్లు కాదు. అప్పట్లోనూ సత్యం చదువు గురించి తప్ప మిగిలిన వేవీ పట్టించుకునేవాడు కాదు. అతనికి ఉన్న శ్రద్ధవల్లనే యూనివర్శిటీ దాకా వెళ్లాడు. ఎమ్మే పరీక్షలు రాసి వచ్చానని చెప్పాడు. వాడ్ని చూస్తే ముచ్చటేసింది. మనిషి కూడా బాగా ఎదిగాడు. కొంచెం నల్లగా ఉన్నా, నూనె కారుతున్న నల్లని ఉంగరాలజుట్టు నుదిటిమీదకు వింత అందాన్ని తెచ్చిపెట్టింది. ఇద్దరూ తోటలోపలికి నడిచారు. ఒక చెట్టు నీడన కూర్చున్నారు.

"నీకు జరిగిన అన్యాయం విన్నాను, సావిత్రీ.... ఇంత చిన్న వయస్సులోనే పెళ్లికావటం, మొగుడు పోవటం, జీవితానందమంతా చెయ్యిజారిపోవటం తల్చుకుంటే బాధేస్తుంది...." సానుభూతి చూపించాడు సత్యం.

"ఆ పెళ్లి అయినప్పుడు నే నేమీ సుఖాల పడవలమీద తేలిపోలేదు. అందుచేత ఇప్పుడు నేను పెద్దగా విచారపడుతున్నది కూడా ఏమీలేదు...." అన్నది సావిత్రి.

"కావచ్చు. అయిపోయిన దాన్ని గూర్చి చేయగలిగిందేమీ లేదు. కనీసం జరగబోయేదాన్ని గూర్చయినా ఆలోచించుకోవాలిగా. ఎన్నాళ్లిలా ఒకరి దయాధర్మాలమీద ఆధారపడతావు? ఇప్పుడైనా చదువుకుని ప్రైవేటుగా పరీక్షలకు కూర్చోరాదా?" అని అడిగాడు.

"ఇన్నాళ్లు నాకీ ఆలోచన రాకకాదు. కానీ ఈరోజు ఎలా గడుస్తుందీ అన్నదే ఎప్పటికప్పుడు నా సమస్య. ఇంక రేపటి సంగతి ఆలోచించే ఓపికా, తీరికా ఎక్కడివి? పైగా ఈ రోజుల్లో అన్నీ పుష్కలంగా ఉన్నవాళ్లకే చదువు కొనుక్కోవటం చేతకావడంలేదు. నాలాంటి దానికి చదువుకోవా లనుకోవటం ఓ పెద్ద లగ్జరీ...." అని చెప్పి తలెత్తి చూసింది సావిత్రి. అప్పుడామె కళ్లల్లో కన్నీటి సుడిగుండాలను సత్యం చూడగలిగాడు.

"దాదాపుగా నీ పరిస్థితిలాంటిదే నా పరిస్థితికూడా" అంటున్న సత్యానికి వెంటనే అడ్డుచెప్పింది సావిత్రి ఆత్రంగా.

"అలా అనకు. నీకు 'నా' అనేవాళ్లు కొందరున్నారు....."

"నిస్సహాయ స్థితిలో ఉన్నవాళ్లవల్ల ఒరిగిందేమీలేదు. మనలాంటివాళ్లం పరిస్థితులకు ఎదురుతిరిగి శక్తికొలది పోరాడకపోతే, జీవితంలో చిత్తుగా ఓడిపోతాం. ఇది మనం నేర్చుకోవాల్సిన

మొదటి పాఠం. నీ కా సంకల్పబలం ఉంటే చాలు. నీకు అవసరమైన సాయం నేనున్నాను...." అన్నాడు సత్యం.

సావిత్రి మాట్లాడలేదు. ఆలోచనలో పడింది.

సత్యం వెళ్లిన కాసేపటికి స్వరూప రాణి వచ్చింది. ఆవేళ ప్రత్యేకంగా ఆ పిల్ల ముహంలో కొత్త వెలుగులు తొంగిచూశాయి. కారణం ఏమిటంటే- ఎవరో వచ్చి పెళ్లిచూపులు చూసు కున్నారని సిగ్గుపడుతూనే చెప్పింది. కాబోయే భర్త గురించిన ఎన్నో ఆశలు స్వరూపరాణి ఆలోచనల్లో దోబూచు లాడాయి.

వాళ్లందరితో పోల్చి చూసుకున్నాక, సావిత్రికి తన భవిష్యత్తు అంతా నిరా మయంగా, నిరాశాపూరితంగా కని పించింది. ఇలా ఎన్నాళ్లు గడవాలీ అన్న ప్రశ్నకు సమాధానందొరకలేదు. ఆరోజు రాత్రి భూపాలరావుగారితో చెప్పింది సావిత్రి.


"నేను చదువుకుంటాను- సర్టిఫికెట్ తెచ్చుకుంటాను. ఇందుకు మీరు అనుమ తించాలి."


"ఊ, తర్వాత ?" అని అడిగాడాయన ఆమె ఒళ్లో తలపెట్టుకుని పడుకుని.

"తర్వాత ఎక్కడన్నా, ఏదన్నా ఉద్యోగం చేస్తాను. నేను అబలగా కాదు, సబలగా బతుకుతాను" అంది ప్రేమగా, ఆయన జుట్టు నిమురుతూ.

"నువ్వు అబలగా కాదు, తబలగానే బాగుంటావు" అన్నాడాయన నున్నగా ఉన్న ఆమె వీపును వెనకనుంచి చేతితో నిమురుతూ.

చాలా యాదాలాపంగానే భూపాల రావుగారు అన్నమాటలు, సావిత్రి గుండెలమీద సమ్మెటపోట్లలా తగిలినై. ఆమె అహం దెబ్బతింది. నెమ్మదిగా ఆయన్ను పక్కకి తప్పించి ఇవతలికి వచ్చింది.





మొదటిసారి తన శీలాన్ని దోచుకున్నప్పుడు బాధపడలేదు. తను నాలుగు రోజులు కనపడలేదన్న కారణంతో భర్తను చంపించి, దిక్కులేని తనను ఈ గూటిలోకి చేర్చినందుకూ ఏడవలేదు. ఎవరో ఆయాచితంగా తన దగ్గరకివచ్చి, అదుగో వెండితెర వెలుగుల్లోకి పోదాం పద అంటే, ఈయన అడ్డుపడ్డప్పుడూ మనసు గాయపడలేదు. కానీ తనను తబల అన్నందుకు మాత్రం గుండె మండిపోయింది.

ప్రతికారవాంఛ ప్రజ్వరిల్లింది. ఇంక మళ్లీ మామూలు మనిషి కాలేకపోయింది. ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు భూపాలరావు.

మర్నాడు సాయంత్రం సావిత్రి సత్యంకోసం కబురుచేసింది. సాయంత్రం వచ్చాడు. అదే సమయానికి స్వరూపరాణి వస్తుందని తెల్సు. వాళ్లూ చిన్నతనంలో ఒక క్లాసులో చదువుకున్నా, ఇప్పుడు ఎవరి 'క్లాసు' వాళ్లది కాబట్టి, అంతగా పరిచయాల్లేవు. సావిత్రి కావాలని ఇద్దర్నీ ఒకచోట కలిపింది. ఇద్దర్నీ అనేక విషయాల్లో కదిపింది– మనసుల్లో దాగిఉండే యవ్వన కాంక్షాస్మృతుల్ని కుదిపింది. ఇంక వాళ్లిద్దర్నీ ఆ తోటలో వదిలింది.

నెల తిరగకముందే సత్యం, స్వరూపరాణి విడదీయలేనంత దగ్గరైనారు. పాఠాలనే తప్ప, బ్రతుకు పాఠాలను అంతగా చదువుకోని వాళ్లిద్దరికీ, జీవితాన్ని విపరీతంగా చదివేసిన సావిత్రి ధైర్యం చెప్పింది. ధీమా కలిగింది.

రెక్కలొచ్చిన పక్షులు ఎగిరిపోవటాన్ని చూసి తృప్తిగా నిట్టూర్చింది.

ఆ తర్వాత భూపాలరావు పడిన యాతన, అవమానం చూసి నవ్వుకుంది సావిత్రి. నెలరోజులకు స్వరూపరాణి ఆచూకీ తెల్సింది. రమ్మనమని అడిగి వచ్చాడు. రాలేనని చెప్పింది.

మరదలు చేసిన పనికి తలెత్తుకు తిరగలేనని భూపాలరావు భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఆయనకు కంటిమీద కునుకు పట్టక, నిద్రమాత్రలు మింగి పడుకుంటున్నాడు. అవమానాభారాన్ని మర్చిపోలేని భూపాలరావు ఇల్లు వదలి బయటకు రావటంలేదు. ఒకరోజు సావిత్రినే ఇంటికి పిలిపించుకున్నాడు.

చాలా బాధపడుతూ చెప్పాడు. "చూశావా" సావిత్రీ, ఈ కష్ట సమయంలో నా భార్యగూడా నన్ను ఒంటరిగా వదిలేసి వెళ్లింది. అన్నీ సక్రమంగా ఉన్నప్పుడూ, ఆనందంగా ఉన్నప్పుడే అందరూ మనవెంట ఉంటారు. కష్టాలు కమ్ముకొచ్చినప్పుడు కట్టుకున్న భార్య కూడా తిట్టుకుంటూనే ఉంటుంది. కదూ.."

ఆయన్ని చూసిన సావిత్రికి ఒక్కక్షణం జాలేసిన మాట నిజం. వెంటనే ఒకనాడు ఆయన అహంభావం పడగవిప్పి బుసకొట్టినప్పుడు అన్నమాట కూడా వెంటనే గుర్తొచ్చింది.

భూపాలరావే మళ్ళీ అన్నాడు. "ఇవాళ నువ్వే నా భార్యవు. లోకంతో మనకు పనిలేదు. ఈ ఇంట్లో మన లోకం మనది.... ఒకనాడు నువ్వు నన్ను అడిగావు, నా భార్య స్థానాన్ని ఇవ్వమని. ఆ కోరిక ఈవేళ తీరుస్తాను. ఈ ఇల్లు నీది– ఇప్పుడు నీ కిక్కడ అడ్డులేదు. అడుగు.... ఏం కావాలో కోరుకో...."

"అప్పుడూ, ఇప్పుడూ నా కోరిక అదే. నేను ఒక్కరాత్రి అయినా మీ భార్య స్థానాన్ని పొందాలి. అందుకు, తోటలోనుంచి ఇంటిలోకి రావటంతో చాలదు. ఆమె చీర కట్టుకోవాలి. నగలు పెట్టుకోవాలి. నా చేత్తో మీకు వడ్డన చెయ్యాలి– ఇద్దరం కలిసి భోజనం చెయ్యాలి...."

ఆవేళ అమె కోరికలన్నిటినీ తీర్చాడు భూపాలరావుగారు. సావిత్రి ఉంపుడుగత్తెలా ఊరిబయట పడిఉండలేదు. ఇవాళ ఊళ్లోకి వచ్చింది. ఊరిపెద్ద వళ్లోకి వచ్చింది. కలవారి కోడలి స్థానంలోకి వచ్చింది.

పాలగ్లాసు తీసుకుంది. ఆయన వేసుకునే నిద్రమాత్రలు ఒక్కొక్కటే వేసింది, స్పూన్‌తో బాగా కలిపింది–

భూపాలరావుగారిని గుండెల్లోకి లాక్కుంది. ప్రేమతో విషాన్ని తాగించింది. ఆయన మత్తుగా కళ్లు మూసుకున్నాడు.

తెలతెల్లవారుతుండగా, సావిత్రి ఊరి పొలిమేరలు దాటి వేగంగా వెళ్తోంది. సినిమా డైరక్టరు అడ్రసు రాసిఇచ్చిన కాగితం ఆమె చేతిలో నలిగిపోతోంది. ఆ చీకట్లో ఆమె కన్నుల వెన్నెలే ముందుకు దారి చూపుతోంది.

గూడెంలోనుంచి ఎవరో వాయిస్తున్న తబల— లయబద్ధంగా వినిపిస్తోంది. ఆ స్వరం ఆమెను వెన్నంటి వెళ్తోంది.